స్ట్రాంగ్‌రూంల్లో ఈవీఎంలు భద్రం

సిటీబ్యూరో, జూన్ 4 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికలు సజావుగా ముగిశాయి. ఎక్కడ ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు ఎన్నికల క్రతువును ముగించారు. అయితే ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం తేల్చిన ఈవీఎంలను మాత్రం పటిష్ట భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఈవీఎంలతో పాటు వీవీప్యాట్లు, పోస్టల్ బ్యాలెట్ పేపర్లు, వీవీప్యాట్లలోని స్లిప్పులు, మాక్‌పోల్ ధ్రువపత్రాలు, పీఓ డైరీ, టెండర్ బ్యాలెట్ పేపర్, తదితర

45 రోజుల తర్వాత ఐదేండ్ల పాటు ఎన్నికల సంఘం ఆధీనంలోకి

ఎన్నికల సామగ్రిని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆయా రిటర్నింగ్ అధికారులు స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచి తాళాలు వేసి సీల్ వేశారు. ఈవీఎంల భద్రతకు ఎన్నికల సంఘం అధికారులు స్ట్రాంగ్ రూమ్‌లలో పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే ఎన్నికల ఫలితాలు వెల్లడించిన తర్వాత 45 రోజుల పాటు జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఈవీఎంలకు భద్రత కల్పిస్తారు. అనంతరం వాటిని ఎన్నికల సంఘానికి అప్పగించి గోదాములకు చేర్చుతారు. ఎన్నికల సంఘం నియమించిన ఇంజినీర్లు వచ్చి వాటిలోని డేటాను తొలగించి అవసరాన్ని బట్టి దేశంలో ఎక్కడైనా ఎన్నికలు జరిగితే అక్కడికి తీసుకువెళ్లి ఉపయోగిస్తారు.

ఐదేండ్లలో ఆ సమయంలో అవి కీలకం..

అభ్యర్థుల మధ్య ఎన్నిక పోటాపోటీగా జరిగినప్పుడు గోదాముల్లో భద్రపరిచిన ఈవీఎంల కంట్రోల్ యూనిట్లు కీలకమవుతాయి. అతి తక్కువ ఓట్లతో ఓడిపోయిన అభ్యర్థులు ఎప్పుడైనా ఓట్లను మళ్లీ లెక్కించాలని న్యాయస్థానాలకు వెళ్లవచ్చు. అంతేకాదు ఓట్ల లెక్కింపు ముగిసిన తర్వాత గెలిచిన అభ్యర్థిపై ఓడిన వారు ఎప్పుడైనా ఫిర్యాదు చేసే అవకాశం ఉంది.

ఓట్ల లెక్కింపు సమయంలో ఏవైనా అవకతవకలు జరిగాయని సదరు అభ్యర్థులు భావించి న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. ఇలాంటి సందర్భాల్లో అభ్యర్థులకు న్యాయం చేయడానికి ఈవీఎంల కంట్రోల్ యూనిట్లలో నిక్షిప్తమైన ఓట్లను మళ్లీ లెక్కించాలని న్యాయస్థానం ఆదేశించవచ్చు. అలాంటి సందర్భాల్లో ఇవి కీలకం అవుతాయి. ఏ నియోజకవర్గంలో ఫిర్యాదు అందితే దానికి సంబంధించిన కంట్రోల్ యూనిట్లలో ఓట్లను తక్షణమే లెక్కించడానికి వీలుగా అధికారులు ఈవీఎంలను భద్రపరిచారు.

ఎంఆర్‌పీ ధరలకే విత్తనాలను విక్రయించాలి

ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ రుద్రమూర్తి

పెద్దేముల్, జూన్ 4 : ఎరువులు, మందుల దుకాణాల యజమానులు ప్రతి రైతుకు కొనుగోలు విత్తన రసీదును ఇవ్వడంతోపాటు విత్తన ప్యాకెట్‌పై ఉన్న ఎంఆర్‌పీ ధరలకే విత్తనాలను విక్రయించాలని తాండూరు వ్యవసాయశాఖ ఏడీఏ రుద్రమూర్తి సూచించారు.మంగళవారం మండల కేంద్రంలో ఉన్న పలు ఎరువులు, మందుల దుకాణాల్లో తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల యజమానులు రైతులకు లూజ్ , నాసిరకం, నకిలీ విత్తనాలను అమ్మరాదన్నారు. దుకాణాల్లో స్టాక్ రిజిష్టర్లతో పాటు రైతులకు విక్రయిస్తున్న విత్తనాలకు సంబంధించిన కొనుగోలు రిజిష్టర్లను కూడా తప్పకుండా నమోదు చేయాలని ఆదేశించారు. ఎరువులు, రసాయనిక మందుల ధరల పట్టికను అందుబాటులో ఉంచాలన్నారు. ఆయన వెంట ఏఈవో వినయ్ ఉన్నారు.

కౌంటింగ్ డే సోషల్ మీడియా జోరు

ఫలితాలపై నగరవాసుల్లో ఉత్కంఠ

ఉదయం నుంచే టీవీలకు అతుక్కుపోయిన జనాలు

సిటీబ్యూరో, జూన్ 4(నమస్తే తెలంగాణ): మూడునెలల ఎన్నికల పర్వానికి తెర పడింది. ఎన్నికల ప్రక్రియ చివరిదైనా కౌంటింగ్ దశ ఉత్కంఠతో ముగిసింది. దేశవ్యాప్తంగా ఎన్నికల ఫలితాలను తెలుసుకునేందుకు జనాలు ఉదయం నుంచే ఆసక్తిగా తిలకించారు. రాజకీయ పార్టీల కార్యాలయాలు, పార్టీల నేతలు బిగ్ స్క్రీనింగ్‌తో సందడి వాతావరణం నెలకొనగా.. సిటీ జనాలు కౌంటింగ్ సరళిని గమనిస్తూ ఉండటంతో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారిపోయింది. పోటాపోటీగా కామెంట్లు, రీట్వీట్లు, రీల్స్‌తో మోతమోగిపోయింది. నెటిజన్లు ఉదయం నుంచే చురుగ్గా వ్యవహరించడంతో రిజల్ట్ డే రోజున electionresultupdate, 2024, LoksabhaPollResults యాష్ ట్యాగ్ ట్రెండింగ్‌లోకి వచ్చాయి. ఇక పొరుగు రాష్ట్రం ఏపీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అత్యంత ఉత్కంఠకు తెరలేపాయి. ఉదయం నుంచే వైసీపీ, టీడీపీ, పవన్ మద్దతుదారులు కౌంటింగ్ సరళిని సోషల్ మీడియాలో పంచుకోవడంతో మరింత చర్చనీయాంశంగా మారింది.

ఇదే సమయంలో అబ్ కీ బార్ మోదీ సర్కార్ అంటూ బీజేపీ సేనలు ఫలితాలను చూసి కొంత నిరుత్సాహానికి గురికాగా, కాంగ్రెస్ మద్దతుదారులు కూడా ఫలితాలను తెలుసుకునేందుకు ఎక్కువగా ఎక్స్, ఇన్‌స్టాతోపాటు, ఉదయం నుంచే యూట్యూబ్‌లో వచ్చే లైవ్ టెలికాస్ట్‌లకు అతుక్కుపోయారు. దీంతో నగరంలో ఉదయం నుంచి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు నిర్మానుష్యంగా మారింది. ముఖ్యంగా ఆఫీసులకు వెళ్లేవారితో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన కూడళ్లు కూడా ఇవాళ తక్కువ ట్రాఫిక్ రద్దీతో వాహనాలు ముందుకు సాగాయి. ఇక ఎన్నికల కోడ్, 144 సెక్షన్ అమలులో ఉండటంతో ఫలితాలు వెలువడినా నగరంలో పెద్దగా సంబురాలు చేసుకోలేదు. పార్టీ కార్యాలయాలకే సంబురాలు పరిమితమయ్యాయి. ఇక మెజార్టీ జనాలు తమ అభిప్రాయాలను పంచుకునేందుకు సోషల్ మీడియాను ఆశ్రయించారు.

మహిళకు టోకరా...

బంజారాహిల్స్, జూన్ 4: కుటుంబ సభ్యుల అకౌంట్‌లో డబ్బు డిపాజిట్ చేసేందుకు వచ్చిన ఓ మహిళకు టోకరా వేసి.. డబ్బులు కాజేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన రమా మండల్ పదేండ్లుగా బంజారాహిల్స్ రోడ్ నం. 14లోని క్రాస్ విండ్స్ అపార్ట్‌మెంట్స్‌లో కేర్ టేకర్‌గా పనిచేస్తున్నది. ఈ నెల 2న ఆమె సొంతూరులో ఉంటున్న కుమారుడు ఆకాశ్ మండల్ అకౌంట్‌లో డబ్బులు డిపాజిట్ చేసేందుకు బంజారాహిల్స్ రోడ్ నం. 10లోని ఎస్‌బీఐ బ్యాంకు వద్దకు వెళ్లింది. అక్కడ క్యాష్ డిపాజిట్ మిషిన్ వద్ద డబ్బులు వేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఓ వ్యక్తి ఆమె వద్దకు వచ్చాడు. తనకు అర్జెంట్‌గా క్యాష్ కావాలి.. మీ వద్దనున్న నగదు తనకు ఇస్తే ఫోన్ పే ద్వారా ఆ డబ్బును ఆకాశ్ మండల్‌కు పంపిస్తానంటూ నమ్మబలికాడు. దీంతో రూ.20వేలు అతడికి ఇవ్వగా.. ఫోన్ పే ద్వారా పంపించినట్లు గుర్తు తెలియని వ్యక్తి మెసేజ్ చూపించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కొద్ది సేపటి తర్వాత ఆమె కుమారుడికి ఫోన్ చేసి డబ్బులు గురించి తెలుసుకోగా.. తన అకౌంట్‌లోకి డబ్బు రాలేదని చెప్పాడు. రెండు రోజులైనా డబ్బులు రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు మంగళవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఎగ్జిట్‌పోల్ చూసి.. బెట్టింగ్

ఫలితాలతో బోల్తాపడ్డ వైసీపీ బెట్టర్స్

సిటీబ్యూరో, జూన్ 4 (నమస్తే తెలంగాణ): ఒకపక్క దేశ రాజకీయాల్లో బీజేపీకి ప్రతికూల ఫలితాలు వస్తుండటం.. మరోపక్క ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ కూటమి విజయదుందుబి మోగిస్తూ ఫలితాలు వెలువడ్డాయి. అయితే, హైదరాబాద్‌తో పాటు ఏపీలోని పలు ప్రాంతాలు విదేశాల్లోని పలువురు టీడీపీ, వైసీపీ కార్యకర్తలు బెట్టింగ్‌లు నిర్వహించారు. కొందరు టీడీపీ గెలుస్తుందంటే.. మరొకరు వైసీపీ గెలుస్తుందని బెట్టింగ్‌లు పెట్టారు. ఎగ్జిట్‌పోల్స్‌తో టీడీపీకి విజయావకాశాలు తగ్గుతున్నాయని కొన్ని సంస్థలు చెప్పాయి. అంతకు ముందు నుంచే బెట్టింగ్‌ల జోరు ఉండటం, ఎగ్జిట్ పోల్ తరువాత ఆ జోరు మరింత పెరిగింది. వెయ్యి రూపాయల నుంచి కోట్ల రూపాయల వరకు ఈ బెట్టింగ్‌లు జరిగాయి. కొందరైతే ఫలాన పార్టీపై బెట్టింగ్ పెట్టామని చెబుతూ.. ఒప్పంద పత్రాలను సోషల్ మీడియాలో పెట్టారు. వైసీపీని సంక్షేమ పథకాలే పక్కాగా గెలిపిస్తాయని చాలా మంది భావించారు. ఈ క్రమంలో వైసీపీపై బెట్టింగ్ పెట్టిన వాళ్లు కూడా చాలా మంది ఉన్నారు. అలాంటి వాళ్లందరు.. ఏపీలో ఫలితాలు టీడీపీ వైపు వన్‌సైడ్ వస్తుండటంతో ఖంగుతిన్నారు. టీడీపీపై బెట్టింగ్ పెట్టిన వాళ్లు సంబురాల్లో మునిగిపోవడంతో, వైసీపీపై బెట్టింగ్ పెట్టిన వాళ్లు నిరుత్సాహానికి గురయ్యారు. హైదరాబాద్‌లో కూడా చాలా మంది బెట్టింగ్ పెట్టినవాళ్లున్నారు. బెట్టింగ్ చట్టవిరుద్ధమైనా పట్టించుకునే వారు లేరన్న విమర్శలున్నాయి,

విద్యుత్ షాక్‌తో కార్మికుడి మృతి

మన్సూరాబాద్, జూన్ 4: విద్యుత్ షాక్‌కు గురై ఓ భవన కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, మర్రిపల్లి గ్రామానికి చెందిన వర్కూరి సత్తయ్య (45) కూలీ. మర్రిపల్లిలో నక్క ప్రభు నూతనంగా ఓ భవనాన్ని నిర్మిస్తున్నాడు. ఆ భవనంలో కూలీ పనులు చేసేందుకు సత్తయ్య మంగళవారం ఉదయం 6 గంటలకు వెళ్లాడు. మొదటి అంతస్తులో పనిచేస్తూ ఐరన్ రాడ్డును కిందకు వేస్తుండగా.. పక్కనే విద్యుత్ వైర్లకు తగలడంతో షాక్‌కు గురై మొదటి అంతస్తు నుంచి కింద పడిపోయాడు. అతడిని వెంటనే చికిత్స నిమిత్తం నాగోల్ చౌరస్తాలోని శ్రీలక్ష్మీ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌కు తరలించారు. తీవ్రంగా గాయపడిన సత్తయ్యను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు.

'జయ హనుమంత' గ్రంథావిష్కరణ

ముషీరాబాద్, జూన్ 4: చిక్కడపల్లి త్యాగరాయ గానసభ 58వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం 'జయ హనుమంత' గ్రంథావిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి ముఖ్య అతిథిగా విచ్చేసి జయ హనుమంత గ్రంథాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు బాల సుష్మాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన వీణా వాదన, సంగీత కార్యక్రమాలు, తులసీ శిష్య బృందం నృత్య ప్రదర్శనలు రంజింపచేశాయి.

వైమానిక దళ ఉద్యోగాల పేరుతో మోసం.. అరెస్టు

కుత్బుల్లాపూర్, జూన్ 4: ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసగించిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. జయబేరికాలనీ బాలాజీ రెసిడెన్సీలో కేతావత్ సంతోష్ ఉంటున్నాడు. తనకు ఎయిర్‌ఫోర్స్ ఉన్నతాధికారులతో మంచి పరిచయాలు ఉన్నాయని, ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురితో నమ్మబలికాడు. ఒక్కొక్కరి వద్ద రూ.3 నుంచి 6 లక్షల చొప్పున సుమారు రూ. కోటి వరకు వసూలు చేశాడు. ఆపై బోగస్ ఇంటర్వ్యూ చేసి నకిలీ పత్రాలు, స్టాంపులతో పరీక్షలు నిర్వహించి ఆఫర్ లెటర్లను కూడా ఇచ్చాడు. నిజమేనని నమ్మిన యువత ఆఫర్ లెటర్లను ఎయిర్‌ఫోర్స్‌లో చూపించగా బోగస్ అని తెలిపారు. సంతోష్ మోసగించినట్టు తేలడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. నిందితుడిపై నిఘా పెట్టిన పేట్ బషీరాబాద్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

మత విద్వేశాలను రెచ్చగొడుతున్న ముగ్గురి అరెస్టు

అడ్డగుట్ట, జూన్ 4: సోషల్ మీడియాలో వీడియోలను పోస్టు చేస్తూ మత విద్వేశాలను రెచ్చగొడుతున్న ఓ యువకుడు, ఇద్దరు మైనర్లను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించాడు. ఈ ఘటన చిలకలగూడ పోలీసుల కథనం ప్రకారం.. వెస్ట్ మారేడుపల్లికి చెందిన నోయల్ శోభిత్ రాజ్ (18), సీతాఫల్‌మండికి చెందిన మరో ఇద్దరు మైనర్లు కలిసి ఓ వర్గాన్ని ఉద్దేశించి 'హైదరాబాదీ జెమ్స్‌బాండ్' అకౌంట్‌పై ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియోలను పోస్టు చేశారు. సదరు వీడియోలు ఓ వర్గాన్ని రెచ్చగొట్టే విధంగా ఉన్నాయి. మహ్మద్ ఇనాయత్ ఉల్లా షరీఫ్ సోమవారం ఉదయం 11 గంటల సమయంలో ఆ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో చూసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సదరు యువకులను ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని చిలకలగూడ పోలీసులకు అప్పగించారు. పోలీసుల దర్యాప్తులో యువకులు నేరాన్ని అంగీకరించారు. యువకుల నుంచి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం వారిని రిమాండ్‌కు తరలించినట్లు చిలకలగూడ పోలీసులు తెలిపారు.

మీర్‌పేటలో మహిళ హత్య

బడంగ్‌పేట, జూన్ 4: మీర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో ఓ మహిళ హత్యకు గురైంది. ఎస్ఐ గోవిందస్వామి కథనం ప్రకారం.. మహేశ్వరం మండలం కేసీ తండాకు చెందిన ప్రభు కూతురు స్వాతి వివాహం రెండేండ్ల కిందట వినాయకహిల్స్ నివాసి లలిత కుమారుడు జయరాంతో జరిగింది. కొద్ది రోజులు స్వాతి, జయరాం కాపురం సజావుగానే సాగింది. ఈ మధ్య కాలంలో అత్త లలిత, కోడలు స్వాతి మధ్య గొడవలు మొదలయ్యాయి. మంగళవారం కూడా వీరి మధ్య గొడవలు జరిగాయి. ఈ విషయం తెలిసిన ప్రభు కూతురు వద్దకు వచ్చాడు. గొడవకు సంబంధించిన వివరాలను తెలుసుకుంటున్న క్రమంలో లలిత, ప్రభు గొడవ పడ్డారు. కోపంతో ప్రభు నెట్టడంతో లలిత కిందపడిపోయింది. ఇంట్లో ఉన్న సుత్తెతో ప్రభు దాడి చేయడంతో లలిత తలకు బలంగా దెబ్బ తగిలి మరణించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధిహామీ పనులు చేస్తూ కూలీ మృతి

బొంరాస్‌పేట, జూన్ 4 : ఉపాధిహామీ పనులు చేస్తూ ఓ కూలీ మృతిచెందిన ఘటన దుద్యాల మండల కేంద్రంలో జరిగింది. గ్రామానికి చెందిన గొల్ల లక్ష్మయ్య(48) మంగళవారం ఉపాధిహామీ పనులు చేయడానికి వెళ్లాడు. పనులు చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి కూలీలు ఆయనను దవాఖానాకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. లక్ష్మయ్యకు భార్యతో పాటు కూతురు, కుమారుడు ఉన్నారు. నిరుపేద అయిన లక్ష్మయ్య కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

'కొండా' గెలుపుతో బీజేపీ సంబురాలు

పరిగిలో సంబురాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

పరిగి, జూన్ 4: చేవెళ్ల పార్లమెంటు సభ్యుడిగా బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి విజయం సాధించడంతో మంగళవారం సాయంత్రం పరిగి పట్టణంలో బీజేపీ శ్రేణులు సంబురాలు జరిపారు. పట్టణంలోని బస్టాండ్ వద్ద బాణా సం చా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్, జిల్లా కార్యదర్శి పెంటయ్యగుప్త తదితరులు పాల్గొన్నారు.

తాండూరు: తాండూరు నియోజకవర్గంలో బీజేపీ నేతలు, అభిమానులు సంబురాలు జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్వీట్లు పంచి పెట్టారు. పలు చోట్ల పటాకులు కాల్చారు.

వికారాబాద్: వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్, బీజేఆర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవ రెడ్డి నియోజక వర్గ ఇన్‌చార్జి వడ్ల నందు తదితరులు పాల్గొన్నారు.

కులకచర్ల: కులకచర్ల మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు, ఘనాపురం వెంకటయ్య గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు గాదె మహిపాల్, కులకచర్ల మాజీ సర్పంచ్ సౌమ్యావెంకట్ రాంరెడ్డి, జానకీరాం, నాయకులు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లి: మర్పల్లి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. పటాకులు కాల్చి స్వీట్లు తినిపించుకున్నారు. కేవీఆర్ ట్రస్ట్ మండల కో ఆర్డినేటర్ శేఖర్ మొమిన్‌పేట్‌లోని సెల్వాల్ సొసైటీ అనాథ ఆశ్రమంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రామేశ్వర్ రెడ్డి, మల్లేశం, యాదవ్‌రెడ్డి, భరత్, నాగేశ్, నరేశ్, మధు పాల్గొన్నారు

బైక్‌ను తప్పించబోయి ఆర్టీసీ బస్సు బోల్తా

ప్రయాణికులు సురక్షితం - బైకు నడుపుతున్న వ్యక్తి మృతి

మర్పల్లి, జూన్ 4 : బైకును తప్పించబోయి ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో బైకు నడుపుతున్న వ్యక్తి మృతి చెందాడు. కోట్‌పల్లి మండల పరిధిలో మంగళవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వికారాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కోట్‌పల్లి వచ్చి తిరిగి వికారాబాద్‌కు వెళ్తుండగా కోట్‌పల్లి మండలంలోని లింగంపల్లి చౌరస్తా వద్ద ఎదురుగా వస్తున్న బైకును తప్పించబోయే ప్రయత్నం చేయగా పక్కనే ఉన్న కల్వర్టులోకి బోల్తా కొట్టింది. అయితే బస్సులోని ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారు. కాగా బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ధారూర్ మండలం కుక్కింద గ్రామానికి చెందిన అంజయ్య (45)కు గాయాలు కాగా చికిత్స కోసం తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు..మృతుడు మేన మామ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్రవంతి తెలిపారు

రాష్ట్ర గీతంలో సాయుధ రైతాంగ

పోరాట ప్రస్తావన లేకపోవడం బాధాకరం

బంజారాహిల్స్,జూన్ 4: తెలంగాణ రాష్ట్ర గీతంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం గురించి ప్రస్తావన లేకపోవడం బాధాకరమని సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ అమరవీరుల స్మారకట్రస్ట్ అధ్యక్షుడు సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. ప్రముఖ కమ్యూనిస్టు నేత రావి నారాయణ రెడ్డి 118వ జయంతిని పురస్కరించుకుని బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని ఎమ్మెల్యే కాలనీలో ఉన్న రావి నారాయణరెడ్డి ఆడిటోరియం వద్ద తెలంగాణ అమరవీరుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ అమరవీరుల స్మారకట్రస్ట్ అధ్యక్షుడు సురవరం సుధాకర్‌రెడ్డి, సీపీఐ నారాయణ, చాడ వెంకట్‌రెడ్డి, పల్లా వెంకటరెడ్డి, ఈటీ, నర్సింహ, కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి తదితరులు రావి నారాయణరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు. రజాకార్లకు వ్యతిరేకంగా మక్దుం మొహియుద్దీన్. బద్దం ఎల్లారెడ్డి తదితర నేతలతో కలిసి గెరిల్లా యుద్ధాలు ప్రారంభించి వారి వెన్నులో చలిపుట్టించిన ఘనత రావినారాయణరెడ్డికి దక్కుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో తెలంగాణ సాయుధ పోరాట యోధులను స్మరించుకోకపోవడం. రాష్ట్ర గీతంలో తెలంగాణ సాయుధ పోరాటం గురించి ప్రస్తావన లేకపోవడం బాధను కలిగించిందన్నారు. అధికారిక గీతంలో ఉన్నా లేకపోయినా తెలంగాణ సాయుధ పోరాటం ప్రజల హృదయాల్లో శాశ్వతంగా ఉంటుందన్నారు. సీపీఐ నారాయణ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా సాయుధ రైతాంగ పోరాటాల వార్షికోత్సవాలను అధికారికంగా జరపకపోవడంతో పాటు దశాబ్ది ఉత్సవాల్లో కూడా రావి నారాయణరెడ్డిలాంటి వీరుల చరిత్రను ప్రస్తావించలేదన్నారు.



బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని రావి నారాయణరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

హిమాయత్‌నగర్‌లోని మఖ్దుం భవన్‌లో రావి నారాయణరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రావి సేవలు మరువలేనివి

హిమాయత్‌నగర్: నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి కమ్యూనిస్ట్ పార్టీకి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు రావి నారాయణ రెడ్డి అందించిన సేవ లు మరువ లేనివని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. రావి నారాయణరెడ్డి 118వ జయంతి సందర్భంగా మంగళవారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దుం భవన్‌లో ఆయన చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన, భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం ఆనాడు జరిగిన సాయుధ పోరాటంలో రావి నారాయణరెడ్డి కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆ పోరాటంతోనే హైదరాబాద్ భారత్‌లో విలీన మైందన్నారు. కమ్యూనిస్ట్ పార్టీ నిర్మాణం కోసం ఎంతో కృషి చేసిన రావి నారాయణ రెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ ఐడబ్ల్యూ రాష్ట్ర నేత సృజన, జ్యోతి పాల్గొన్నారు.

7 రోజుల కస్టడీకి కోరుతూ ఏసీబీ పిటిషన్ దాఖలు

నాంపల్లి కోర్టులు, జూన్ 4 (నమస్తే తెలంగాణ): గొర్రెల పంపిణీ కుంభకోణంలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న గుండమరాజు కళ్యాణ్ కుమార్, రాష్ట్ర గొర్రెలు, మేకల సహకార సమాఖ్య చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సభావత్ రాంచందర్‌ను ఏడు రోజుల కస్టడీకి అప్పగించాలని కోరుతూ ఏసీబీ అధికారులు మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. గొర్రెల పంపిణీలో నిబంధనలను ఉల్లంఘించి, రూ.700 కోట్ల అవినీతికి పాల్పడినట్లు అధికారులు పిటిషన్‌లో పేర్కొన్నారు. కీలక పత్రాలు, జప్తు చేసిన సాక్ష్యాధారాలపై వారి నుంచి సమాచారం తెలుసుకునేందుకు కస్టడీకి ఇవ్వాలని కోరారు. వీరిద్దరి నుంచి పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించాల్సి ఉన్నదని, సమయం లేకపోవడంతో విచారణ పూర్తికాలేదన్నారు. బినామీల పేర్లతో గొర్రెల పంపిణీ జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. విచారణ సమయంలో నిందితులు సహకరించలేదని, కస్టడీకి తీసుకుని అన్ని వివరాలను సేకరించాల్సి ఉన్నదన్నారు. నిందితుల తరపు న్యాయవాదికి అధికారులు నోటీసులు అందించారు. కౌంటర్ దాఖలు చేయాలని న్యాయవాదిని కోరుతూ.. విచారణను బుధవారానికి వాయిదా వేస్తూ కోర్టు ఆదేశించింది.

ఎర్రగడ్డ కార్పొరేటర్ మృతి

ఎర్రగడ్డ, జూన్ 4: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఎర్రగడ్డ డివిజన్ కార్పొరేటర్ షాహీన్‌బేగం అనారోగ్యంతో మంగళవారం ఉదయం మృతి చెందింది. ఆమె భర్త ఎర్రగడ్డ డివిజన్ మాజీ కార్పొరేటర్ అయిన మహ్మద్ షరీఫ్ కూడా అనారోగ్యంతో ఏడు నెలల కిందట చనిపోయాడు. భర్త మృతితో మనస్తాపానికి గురైన షాహీన్‌బేగం ఆరోగ్య పరిస్థితి రోజురోజుకూ క్షీణిస్తూ వచ్చింది. ఈ క్రమంలో ఆమె ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారటంతో చికిత్స కోసం వారం రోజుల కిందట ఓ ప్రైవేటు దవాఖానలో కుటుంబ సభ్యులు చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమె మంగళవారం ఉదయం చనిపోయింది. ఆమె తొలిసారి 2016లో ఎర్రగడ్డ నుంచి ఎంఐఎం పార్టీ తరపున పోటీ చేసి కార్పొరేటర్‌గా గెలిచింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో కూడా అదే పార్టీ నుంచి పోటీచేసిన షాహీన్‌బేగం విజయం సాధించింది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327729-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్ష